ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
21 ఫిబ్రవరి
2025





# గుట్టలో స్వర్ణకలశాలకు ఛాయాధివాసం...!!

**పరమానందంగా 'పంచకుండాత్మక సుదర్శన నారసింహ యాగం'**
**యాదగిరిగుట్టలో రెండో రోజుకు స్వర్ణగోపుర**
**'మహాకుంభాభిషేక సంప్రోక్షణ' మహోత్సవాలు**
**స్వర్ణకలశాలకు చూడముచ్చటగా 'ఛాయాధివాసం'**
**కుంభ సంప్రోక్షణ కోసం ఆలయానికి చేరిన నదీజలాలు**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో దివ్యవిమాన స్వర్ణగోపుర 'మహాకుంభాభిషేక సంప్రోక్షణ' మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు యాగశాలలో 'పంచకుండాత్మక సుదర్శన నారసింహ యాగాన్ని' అర్చకులు పరమానందంగా నిర్వహించారు. వానమామలై పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు, పారాయణీకులు, వేదపండితులు, రుత్వికులు పాంచరాత్ర ఆగమ శాస్త్ర పద్ధతుల్లో స్వర్ణగోపుర ఉద్ఘాటన మహోత్సవాలు చేపట్టారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం వరకు.. తిరిగి సాయంత్రం 6 గంటల నుండి రాత్రి వరకు యాగశాలలో కుంభ సంప్రోక్షణ పర్వాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం మొదట స్వామివారిని ప్రధానాలయం నుండి తిరువీధి సేవ ద్వారా యాగశాల ప్రదేశానికి తీసుకువచ్చి యాగశాల గావించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, పారాయణీకులు, రుత్వికుల వేదపండితుల వేద ఇతిహాసాది పురాణ స్తోత్ర పారాయణం చేశారు. అనంతరం మూలమంత్ర, మూర్తిమంత్ర హవనాలు, నిత్య పూర్ణాహుతి, నివేదన, నీరాజన మంత్రపుష్పం, శాత్తుమరై వంటి పూజా కైంకర్యాలు చేపట్టి తీర్థప్రసాదగోష్ఠి జరిపారు.

## చూడముచ్చటగా 'ఛాయాధివాసం'

ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ప్రధానాలయంలో స్వామివారికి నిత్య ఆరాధన ముగిసిన అనంతరం.. ఛాయాధివాస మహోత్సవాన్ని చూడముచ్చటగా నిర్వహించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపాలపై అధిష్ఠింపజేసే బంగారు కలశాలను దర్పణంలో దర్శింపజేసే వేడుకను కనులపండువగా చేపట్టారు. ఆలయ గోపురాలపై ఏర్పాటు చేసే స్వర్ణ కలశాలను అద్దంలో చూపి వాటి ప్రతిబింబాలకు పవిత్రమైన జలం, పాలతో అభిషేకం నిర్వహించారు. నూతనంగా తయారు చేపించిన స్వర్ణకలశాలకు ఏవైనా దోషాలుంటే తొలగి శక్తిని పొందే ఛాయాధివాసాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భగవంతుడి దివ్య స్వరూపాన్ని బింబ ప్రతిబింబ స్వరూపంలో భగవంతుడిని దర్శించుకోవడం అపూర్వమైనదని అర్చకులు ప్రవచించారు. అంతకుముందు ప్రధానాలయ ఈశాన్యంలో ఏర్పాటు చేసిన యాగశాలలో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ, ద్వారాది కుంభార్చన, బింబ, కుంబ, మండల అగ్ని ఆరాధన, మూర్తిమంత్ర హోమాలు వరుణానువాక హోమం నిర్వహించారు. అనంతరం నిత్య పూర్ణాహుతి, నివేదన, తీర్థప్రసాదగోష్ఠి చేపట్టి తిరువీధి సేవ ద్వారా స్వామివారిని ప్రధానాలయంలోకి ప్రవేశం గావించనున్నారు.

## నారసింహుడి చెంతకు 'నదీజలాలు'

ఈ నెల 23న దివ్యవిమాన స్వర్ణగోపురానికి మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించనున్న నేపథ్యంలో.. దేశంలోని పుణ్యనదుల నుండి పవిత్ర జలాలను సేకరించి కుంభాభిషేక సంప్రోక్షణ నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో జనవరి 30న ఉప ప్రధానార్చకులు మాధవాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చక బృందం నదీజలాల సేకరణకు బయలుదేరింది. దేశంలోని గోదావరి, పెన్ గంగ, యమున, గంగ, ప్రయాగ్ రాజ్ త్రివేణీ సంగమం(గంగ, యమున, సరస్వతీ), సరయూ, గోమతి, నర్మదా, మంజీర, తాలిపేరు, హరిద్రా, కృష్ణా, తుంగ, భద్ర వంటి ముఖ్య నదులతో పాటు మొత్తం 60 నదుల నుండి పవిత్ర జలాలను సేకరించిన అర్చక బృందం.. గురువారం యాదగిరిగుట్ట ఆలయానికి చేరుకుంది. వెండి కలశాలలో సేకరించి తెచ్చిన పవిత్ర నదీజలాలను యాగశాలలో ఏర్పాటు చేసిన కుంభంలో పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నదీ జలాలకు 23 వరకు ప్రత్యేక పూజలతో మంత్రపూరితం చేసి దివ్యవిమాన స్వర్ణగోపురానికి కుంభాభిషేకం, సంప్రోక్షణ చేయనున్నారు.



















ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
21 ఫిబ్రవరి
2025





# పది పరీక్షల ఇంటర్నల్ మార్కుల నివేదికల పరిశీలన

## గుట్ట మండలంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ నారాయణ పరిశీలనలు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండలంలోని పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ పరీక్షల నివేదికలను యాదగిరిగుట్ట పోచమ్మ వాడ గజిటెడ్ హెడ్మాస్టర్ నారాయణ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ పరిశీలనలను విజయవంతంగా పూర్తి చేసింది. గురువారం యాదగిరిగుట్ట మండలంలోని ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గౌరాయపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాసాయిపేట హైస్కూల్లలో ఆయన పరిశీలనలను తన బృందంలోని స్కూల్ అసిస్టెంట్ సతీష్, హిందీ పండిట్ బాబులతో కలిసి పరిశీలనలు చేసి పలు సూచనలు సలహాలను ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన యాదగిరిగుట్టలో మాట్లాడుతూ పదవ తరగతి ఇంటర్నల్ పరీక్షల మార్కుల పరిశీలనలను తాము గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుకూలంగా మార్కులు వేశారా? లేదా అనే విషయాలపై తనిఖీలు చేస్తూ విద్యార్థులను నేరుగా ప్రశ్నిస్తూ తమ వివరాలు నమోదు చేసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం విద్యార్థుల్లో ప్రాజెక్ట్ ల రూపకల్పనకు సంబంధించిన జ్ఞానాన్ని పరిశీలించడం కోసం ఏర్పాటుచేసిన ఈ విధానం లో గల నిబంధనలను పరిశీలిస్తూ విద్యార్థులకు ఇచ్చిన మార్కులను పరిశీలిస్తున్నమని చెప్పారు. కొన్ని పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా మార్కులు వేసిన వారి వివరాలను పేర్కొంటూ వాటిని తొలగించడానికి ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యార్థుల... హాజరు ప్రాజెక్టుల రూపకల్పనకు సంబంధించి చేసిన వివరాలు తమ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను ఆయన నేరుగా పరిశీలించి పలు సూచనలు సలహాలను ఇచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్.వీ.ఎన్ స్కూల్లో ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్, ప్రిన్సిపల్ గొట్టిపర్తి మాధురి, డైరెక్టర్ వృతిక్, ఉపాధ్యాయులు నవీన్, యూసుఫ్, బాలరాజు, యాదగిరి, పవిత్ర, మేరీ, తదితరులతో ఆయన విద్యార్థులను పరీక్షించి సబ్జెక్టుల వారిగా మార్కులు వేసిన విధానాన్ని పరిశీలించారు.

# సీఎం రాక పై గుట్టపై భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన డీసీపీ

## 23న గుట్టకు సీఎం రేవంత్ రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న కుంభ సంప్రోక్షణ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 23న యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో.. గురువారం యాదగిరిగుట్ట క్షేత్రంలో భువనగిరి జోన్ డీసీపీ రాజేష్ చంద్ర భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ, ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రమేష్, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు, ఏఈవో రఘుతో కలిసి యాగశాల, ఉత్తర ద్వారం, ప్రధానాలయం, తూర్పు ద్వారం, క్యూలైన్లు సహా పలు ఆలయ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భద్రత, ఏర్పాట్లకు సంబంధించి పోలీసులు, ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. వీఐపీలు, వీవీఐపీలు ఎక్కువ సంఖ్యలో రానున్న కారణంగా కట్టుదిట్టమైన భద్రత చేయాలని సూచించారు. అదేసమయంలో వీఐపీలకు చేసే ప్రత్యేక ఏర్పాట్ల వల్ల సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా రెవెన్యూ, పోలీస్, ఆలయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. దాదాపుగా 400 మంది పోలీసు బలగాలతో 23న భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు డీసీపీ వెల్లడించారు. స్వామివారి దర్శనానికి ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా..

సామాన్య భక్తులు, వీఐపీలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాగా 23న సీఎం రేవంత్ రెడ్డి ప్రోగ్రాం ఇంకా కన్ఫార్మ్ కాలేదని, ముందస్తు చర్యల్లో భాగంగా భద్రతాపరమైన ఏర్పాట్లపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. కాగా 23న ఆలయంలో నిర్వహించే దివ్యవిమాన స్వర్ణగోపుర మహాకుంభ సంప్రోక్షణ పూజల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని స్వర్ణగోపురాన్ని స్వామివారికి అంకితం చేయనున్నట్లు ఆలయవర్గాలు వెల్లడించాయి.

# సమారిటన్ పబ్లిక్ స్కూల్స్ ICSE బ్రాంచ్ సమీపంలో చెట్ల పునర్ వ్యవస్థీకరణ



హైదరాబాద్, రోమింగ్ న్యూస్: పర్యావరణ సంరక్షణ మరియు పట్టణాభివృద్ధి పట్ల కట్టుబాటు రూపంగా, సమారిటన్ పబ్లిక్ స్కూల్స్ ICSE బ్రాంచ్ సమీపంలోని ECIL ప్రాంతం నుండి నాలుగు చెట్లు GHMC బృందం ద్వారా విజయవంతంగా పునర్ వ్యవస్థీకరించబడ్డాయి. ఈ కార్యక్రమం, ప్రకృతిని సంరక్షిస్తూ పట్టణ అభివృద్ధికి సహకరించే తెలంగాణ ప్రభుత్వ ఆలోచనను ప్రతిబింబిస్తోంది. ఈ గొప్ప కార్యక్రమాన్ని ముందుండి నడిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రభుత్వ అంకితభావాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా చూపిస్తోంది. పచ్చని మరియు ఆరోగ్యకరమైన భవిష్యత్తును సాకారం చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోంది. పర్యావరణ పరిరక్షణ మరియు అభివృద్ధి మండలి జాతీయ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర గ్రీన్ అంబాసడర్, TRSMA రాష్ట్ర సలహాదారు, మరియు లోటస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ అయిన లయన్ కొమటిరెడ్డి గోపాల్ రెడ్డి గారికి ప్రత్యేక అభినందనలు. పర్యావరణ అవగాహనను ప్రోత్సహించడంలో ఆయన నిరంతర కృషి మరియు నాయకత్వం నిజంగా ప్రేరణాత్మకం. సమారిటన్ పబ్లిక్ స్కూల్స్, ICSE బ్రాంచ్, ECIL, సికింద్రాబాద్, హైదరాబాద్ లో, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ, వారిలో ఎకో స్నేహిత భావాలను పెంపొందించడంలో మేము నమ్మకం కలిగి ఉన్నాము. ఈ చెట్ల పునర్ వ్యవస్థీకరణ కార్యక్రమం విద్యార్థులకు మంచి నేర్చుకునే అవకాశం కల్పించింది. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్రను వివరించడంలో ముందంజలో ఉన్నాము. ప్రభుత్వం మరియు సమాజ నేతల చొరవను ప్రత్యక్షంగా చూసిన మా విద్యార్థులు గర్వపడడం మాత్రమే కాకుండా, పర్యావరణ స్థిరత్వం పట్ల బాధ్యతా భావాన్ని కలిగి, స్వచ్ఛందంగా సహకరించాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు జరగాలని కోరుకుంటున్నాము. సమారిటన్ పబ్లిక్ స్కూల్స్, ICSE బ్రాంచ్ ఎల్లప్పుడూ పర్యావరణ అనుకూల విధానాలను ప్రోత్సహిస్తూ, భవిష్యత్తు పౌరులను బాధ్యతాయుతంగా తీర్చిదిద్దడంలో కట్టుబడి ఉంది. మరింత సమాచారం కోసం సంప్రదించండి:

సమారిటన్ పబ్లిక్ స్కూల్స్, ICSE బ్రాంచ్
ECIL, సికింద్రాబాద్, హైదరాబాద్

# యావాపూర్ గల్లీ...గల్లీలో కలెక్టర్ హనుమంతు...!!

**కలెక్టర్ హనుమంతరావు వినూత్న ఒరవడి...!!**

**తన దృష్టికి తెచ్చిన సమస్యలపై ఫోన్లు చేసి పరిష్కరించాలని ఆదేశించిన కలెక్టర్**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: బొమ్మలరామారం మండలం యావాపూర్ ను గురువారం తెల్లవారుజామున సందర్శించారు. ఉదయం 6:30 గంటలకే మండల స్థాయి అధికారులతో కలిసి యావాపూర్ కు చేరుకుని గల్లీగల్లీ కలియతిరిగారు. గడపగడపకు తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలో అధికశాతం రైతులు కూరగాయలు, ఆకుకూరలు పండిస్తారని తెలుసుకున్న ఆయన.. వెంటనే ఆర్గానిక్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డికి ఫోన్ చేసి రైతులకు సూచనలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా కరెంటు సమస్య, అధ్వాన్నంగా ఉన్న రోడ్ల సమస్య పరిష్కరించాలని సంబంధిత ఆఫీసర్లను ఆదేశించారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్కూల్ మూసివేశారని ప్రజలు కలెక్టర్ దృష్టికి తేగా.. వచ్చే ఏడాది నుండి స్కూల్ రీఓపెన్ చేసి టీచర్ ను అలాట్ చేస్తామని హామీ ఇచ్చారు. తమ పిల్లలను ప్రభుత్వ స్కూల్ చేర్పించాలని, ఇందుకోసం అందరు కలిసి తీర్మానం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో శానిటేషన్ సమస్యలు లేకుండా చూడాలని ఎంపీవోను ఆదేశించారు. అనంతరం తుర్కపల్లి మండలం మాదాపూర్ లో ప్రభుత్వ స్కూల్ విజిట్ చేశారు. స్కూల్ లో 15 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉండగా.. వచ్చే ఏడాదిలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు వచ్చేలా చూడాలని హెచ్ఎంకు సూచించారు. తర్వాత అంగనవాడీ సెంటర్ ను సందర్శించి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

# కేంద్రం కొత్త విద్యావిధానం హర్షణీయం..!

**10 వ తరగతి రద్దుపై పునరాలోచన చేయాలి.**

**విద్యావేత్త కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి**

హైదరాబాద్, రోమింగ్ న్యూస్: కేంద్ర కేబినెట్ ఆమోదించిన 2020-కొత్త విద్యా విధానం (NEP) 2024లో విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచే అనేక కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే 10వ తరగతి బోర్డు పరీక్షను రద్దు చేయాలని తీసుకున్న నిర్ణయంపై పలువురు విద్యావేత్తలు మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ జాతీయ సలహాదారులు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి ఈ నిర్ణయాన్ని పునరాలోచించాల్సిన అవసరముందని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొత్త విద్యావిధానం పై కేంద్రం నిర్ణయం నేపథ్యంలో డాక్టర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు 10వ తరగతి సమయం చాలా కీలకమైనదని, ఆ వయసులో మానసిక పరిపక్వత, భవిష్యత్తు విద్యను దృఢత్వం చేసుకొనే పరిస్థితి ఉంటుందన్నారు. 10వ తరగతి పరీక్షల రద్దు విద్యార్థులలో నిర్లక్ష్య ధోరణిని పెంచే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ వయసులో ఒక నిర్దిష్ట లక్ష్యం లేకుంటే వారి భవిష్యత్ ఉన్నత విద్యకు గల ప్రాముఖ్యత తగ్గిపోతుందని తెలిపారు. అందుకే కేంద్రం10వ తరగతి బోర్డు పరీక్ష రద్దు నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారికి సజావుగా విద్యను అందించేందుకు 10వ తరగతి పరీక్ష బోర్డు పరీక్షలు ఒక ప్రామాణిక ప్రమాణంగా కొనసాగించాలి అని సూచించారు. జాతీయ స్థాయి విద్యా నైపుణ్యాల నివేదిక సంస్థ అయిన "ఏసర్" పరిశీలన, పరిశోధనలో భారతీయ విద్యావ్యవస్థ ప్రమాణాలు దారుణంగా పడిపోయిన విషయాన్ని డాక్టర్ గోపాల్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ సమస్య మళ్ళీ మళ్ళీ పునరావృతం కాకుండా ఉండేందుకు 5, 8 తరగతులతోపాటు 10 వ తరగతి పరీక్షలు తప్పనిసరి చేయాలి అని పేర్కొన్నారు. పలువురు విద్యా నిపుణులు కూడా డాక్టర్ కోమటిరెడ్డి వాదనకు బలం చేకూరేలా అభిప్రాయాన్ని వెల్లడించారు. 10వ తరగతి పరీక్ష ఒక విధంగా విద్యార్థులకు ప్రాథమిక అంచనాలను నిర్దేశించే పరీక్ష అని, దీని ద్వారా వారిలో లక్ష్యసాధన శక్తి పెరుగుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా ఈ పరీక్ష లేకుంటే విద్యార్థుల్లో తక్కువ ప్రాముఖ్యత కలిగిన సబ్జెక్టుల పట్ల ఆసక్తి తగ్గి, మెరుగైన విద్యా ప్రమాణాలు క్షీణించే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

